

అభివృద్ధికి పాటుపడాలి..

ఐక్యతతో బోధన్ పట్టణాభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు.

- 8లో ▸



సేవలకు ప్రశంసలు

ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు కలెక్టర్ హనుమంతు ప్రశంసాపత్రాలు అందజేశారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 32.0 /14.5

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

ఘనంగా వేడుకలు

నిజామాబాద్‌అర్బన్: గణతంత్ర దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ముఖ్య అతిథిగా హాజరై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, డాక్టర్ భూపతిరెడ్డి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్, డీఎఫ్‌వో వికాస్ మీనా, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఆయా శాఖ ల జిల్లా అధికారులు పాల్గొన్నారు. వ్యవసాయ, ఉద్యాన వన, జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ, అటవీ, డెయిరీ, పశు వైద్య, విద్య, వైద్యం, మహిళా శిశు సంక్షేమం, నీటి పారుదల, మిషన్ భగీరథ, ఫిషరీస్ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించారు. ఆయా శాఖల శకటాలు ఆకట్టుకున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల శకటానికి ప్రథమ, ఆర్టీసీ శకటానికి ద్వితీయ, వైద్యారోగ్యశాఖ శకటానికి తృతీయ బహుమతులు దక్కాయి. అంతకుముందు క్యాంపు కార్యాలయం, జిల్లా పరిషత్‌లో కలెక్టర్ మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ జెండా ఎగురవేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..

- అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సమాన అవకాశాలు
- ఇందిరమ్మ ఇళ్లు, ఆహారభద్రత కార్డులు నిరంతర ప్రక్రియ
- ప్రతిష్టాత్మకంగా ఆరు గ్యారంటీల అమలు
- అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు
- జిల్లావాసులకు మెరుగైన ప్రజాపాలన అందిస్తున్నాం
- గణతంత్ర దినోత్సవాల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమంలో సరికొత్త అధ్యాయాన్ని సృష్టిస్తూ ఆరు గ్యారంటీలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవాల్లో ఆయన ప్రసంగించారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలని రాజ్యాంగాన్ని రూపొందించిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆరు గ్యారెంటీలైన మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, యువ వికాసం, చేయూత పథకాలను అమలు చేస్తోందన్నారు. జిల్లా వాసులకు మెరుగైన ప్రజాపాలన అందిస్తున్నామన్నారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఆహారభద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు అందించాలనే ఉద్దేశంతో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి గ్రామ/వార్డు సభల ద్వారా జాబితాను రూపొందించామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఆహారభద్రత కార్డులు నిరంతర ప్రక్రియ అని, అర్హత ప్రకారం ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరు చేస్తామన్నారు.



శకటాలను తిలకిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి

జిల్లాలో ఇప్పటివరకు 2,70,716 మందికి వివిధ రకాల పింఛన్‌లను రూ.58.33 కోట్లు చెల్లించామని, అలాగే 2024-25 సంవత్సరంలో 5,908 సంఘాలకు స్త్రీనిధి ద్వారా రూ.140.13 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు వివరించారు. జిల్లాలోని 1,155 పాఠశాలల్లో 99,952 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, 545 గ్రామ పంచాయతీల్లో 2,841 మంది మల్టీపర్పస్ వర్కర్ల ద్వారా పారిశుధ్య నిర్వహణ, రక్షిత మంచి నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

మహిళలకు మహాలక్ష్మి

మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500లకే వంట గ్యాస్‌ను ప్రభుత్వం జిల్లాలో 2,40,825 కుటుంబాలకు అందించిందని కలెక్టర్ వెల్లడించారు. దీని కోసం రూ.25.41 కోట్ల సబ్సిడీ అందించిందన్నారు. అలాగే సగటున ప్రతిరోజూ 94 వేల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నట్లు తెలిపారు.

ప్రజారోగ్యానికి జిల్లా వైద్యారోగ్యశాఖ పాటుపడుతోందని, వ్యాధి నిరోధక టీకాలు 19,112 మందికి (98 శాతం) అందినట్లు తెలిపారు. ప్రతి మంగళవారం మహిళలకు ఎనిమిది రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో 8 భారీ, మధ్యతరహా పరిశ్రమలను రూ.368.45 కోట్లతో స్థాపించగా, 7,324 మందికి ఉపాధి లభిస్తోందని తెలిపారు.

77,181 మంది కార్మికులకు గాను 6,973 మంది కార్మికులు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందారన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో భరోసా సెంటర్ జనవరి 19న ప్రారంభమైందని, పోలీసు కళాబృందాలు ప్రజలను చైతన్య పరుస్తున్నాయన్నారు.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు



జాతీయ జెండాతో విద్యార్థి

2,78,065 కుటుంబాలకు గృహజ్యోతి

గృహజ్యోతి పథకం ద్వారా జిల్లాలో 2,78,065 కుటుంబాలకు 200 యూనిట్ల లోపు ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.102.66 కోట్ల సబ్సిడీ అందించింది. సీఎం గిరివికాస్ పథకం కింద డిసెంబర్ 2024 వరకు 78 మంది లబ్ధిదారుల వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ సౌకర్యం కల్పించాం.

జిల్లాలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కలెక్టర్ వివరించారిలా..

రైతు భరోసా

సాగు యోగ్యమైన భూములుగా భూ భారతి పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ భూములకు రైతు భరోసా పథకం ద్వారా ఎకరాకు (సీజన్‌కు) రూ.6వేల చొప్పున సంవత్సరానికి రూ.12వేలు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయి.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

సాగు భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ప్రతి ఆరు నెలలకు రూ.6 వేల చొప్పున జమవుతాయి.

రూ.782.31కోట్ల రుణమాఫీ

పంట రుణమాఫీ పథకం ద్వారా మొత్తం నాలుగు విడతల్లో 1,00,612 మంది రైతులకు పంట రుణాలు మాఫీ అయ్యాయి. మొత్తం రూ.782.31 కోట్ల రుణమాఫీ రైతులకు వర్తించింది.

రైతుబీమా

జిల్లాలో 2024 - 25 సంవత్సరంలో వివిధ కారణాలతో 391 మంది రైతులు చనిపోయారు. బాధిత కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో రైతు బీమా పథకం ద్వారా రూ.19.55 కోట్లు నేరుగా జమయ్యాయి.

మహిళలకు..

2024-25 సంవత్సరంలో 20,350 సంఘాలకు రూ.1228.72 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యం నిర్దేశించుకోగా ఇప్పటి వరకు 12,730 సంఘాలకు రూ.1,071 కోట్లు అందించాం. 2024 మార్చి వరకు బ్యాంక్ లింకేజీ తీసుకున్న 5,010 స్వయం సహాయక సంఘాలకు 2 నెలల వడ్డీ రాయితీని రూ.1.90 కోట్లు విడుదలయ్యాయి.



ధాన్యం కొనుగోళ్లలో మొదటి స్థానం

ధాన్యం కొనుగోళ్లలో జిల్లా రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచింది. 2024-25 వానాకాలం సీజన్‌లో మొత్తం 676 కేంద్రాల ద్వారా 4,91,497.280 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 78,488 మంది రైతుల నుంచి కొనుగోలు చేసి రూ.1,140.27 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం. అలాగే 44,703 రైతులకు రూ.151.56 కోట్ల బోనస్ చెల్లించాం.



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో..

2024 - 25 సంవత్సరానికిగాను జిల్లాలోని 32 ప్రీ మెట్రిక్, 10 పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో మొత్తం 3,854 మంది విద్యార్థులు ఉన్నారు. బెస్ట్ అవైలేబుల్ స్కూల్స్ స్కీమ్ కింద 1,140 మంది ఎస్సీ విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చాం. కులాంతర వివాహాలు చేసుకున్న నాలుగు జంటలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక ప్రోత్సాహకం అందించాం. 3,985 మంది విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు అందించడంతోపాటు ఫీజుల కోసం రూ.319.073 లక్షలు వెచ్చించాం.

ఆర్ అండ్ బీ పనులు

ప్రణాళిక ప్రకారం 8 కిలోమీటర్ల రహదారి అభివృద్ధి చేసేందుకు రూ.18కోట్లు, ప్రణాళికేతర పనులు 22 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధికి రూ.24కోట్లు మంజూరుకాగా, పనులు కొనసాగుతున్నాయి. ఎస్టీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ రూ.15కోట్లతో 8కిలోమీటర్ల రహదారులు, ఒక బ్రిడ్జి పనులు మంజూరయ్యాయి.

నీటి పారుదల శాఖ

రూ.8.38 కోట్లతో చౌట్‌పల్లి హన్మంత్ రెడ్డి ఎత్తిపోతలకు పరిపాలనా ఆమోదం లభించింది. పనులు పురోగతిలో ఉన్నాయి. 10 చెక్ డ్యాములు పురోగతిలో ఉండగా, ఇప్పటి వరకు రూ.32.32 కోట్లు ఖర్చు చేశాం. 9,214 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించేందుకు ఫత్తేపూర్, సుర్బిరియాల్, చిట్టాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముకు రూ.149.66 కోట్లతో పారిపాలనా ఆమోదం లభించింది.

5.18 లక్షల ఎకరాల్లో పంటలు

2024-25 యాసంగి సీజన్‌లో 5.18 లక్షల ఎకరాల సాగు అంచనాతో ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రధానంగా వరి 4.19 లక్షల ఎకరాల్లో, శనగ 16 వేల ఎకరాల్లో, మొక్కజొన్న 23 వేల ఎకరాల్లో, ఎర్రజొన్న 33 వేల ఎకరాల్లో సాగవుతుందని అంచనాలు సిద్ధం చేశాం.



విద్యార్థుల విన్యాసం

న్యూస్‌రీల్

బల్దియాలకు ప్రత్యేక అధికారులు

నిజామాబాద్‌అర్బన్: మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ల పాలక వర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారిగా అదనపు కలెక్టర్ (లోకల్‌బాడీ) అంకిత్‌ను నియమించగా, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును ప్రత్యేకాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రాష్ట్ర ఉత్తమ ఏఎల్‌ఎంగా రాజశేఖర్

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలో పనిచేస్తున్న చెన్న రాజశేఖర్ రాష్ట్ర ఉత్తమ అసిస్టెంట్ లైన్‌మన్‌గా ఎంపికయ్యారు. ఆదివారం వరంగల్‌లో ఎన్‌పీడీసీఎల్ కార్యాలయంలో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల్లో అవార్డు అందుకున్నారు.

29న షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ

నిజామాబాద్ నాగారం: జిల్లా బ్యాడ్మింటన్ మాస్టర్స్ విభాగంలో ఈనెల 29న టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాసు, కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మోపాల్‌లోని ఫిట్‌నెస్ క్లబ్‌లో బుధవారం ఉదయం 9.30 గంటలకు టోర్నీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 35 నుంచి 75 ఏళ్ల వయస్సు గలవారు టోర్నీలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన..



భరతమాత వేషధారణలో విద్యార్థిని



దేశభక్తి గీతానికి నృత్యం చేస్తున్న విద్యార్థులు

నిరూపిస్తే రాజకీయ సన్యాసం

- హామీలు ఎక్కడా అమలు కావడం లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్: కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు జరిగినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడితోపాటు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ఎలాంటి హామీలను నెరవేర్చలేదని, ప్రజల నుంచి వారికి వ్యతిరేకత ఎదురవుతోందన్నారు. ప్రజలను మోసం చేశారని, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ కార్యక్రమాల గ్రామసభలు అంతా బోగస్ అని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీవి గ్రూపు రాజకీయాలని, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి చెప్పే మాటలన్నీ జోకర్ మాటలుగా మిగిలిపోయాయని ఎద్దేవా చేశారు. ఆ పార్టీల మోసాలపై తిరుగుబాటు చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ నాయకులపై ఎన్ని కేసులు పెట్టినా భయపడబోమని స్పష్టం చేశారు. మేయర్ నీతూకిరణ్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆశన్నగారి జీవన్‌రెడ్డి

నాలుగు పథకాలకు శ్రీకారం

- మంజూరు పత్రాలు అందజేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- అట్టహాసంగా ప్రారంభం

నిజామాబాద్‌అర్బన్: ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్‌కార్డుల జారీ పథకాల అమలుకు గణంత్ర దినోత్సవాన శ్రీకారం చుట్టారు. ఎంపిక చేసిన గ్రామాల్లో లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, అధికారులు మంజూరు పత్రాలు అందజేశారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మోర్తాడ్ మండలం దోమ్‌చందలో, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఎడపల్లి మండలం జైతాపూర్, బోధన్ మండలం లంగ్డాపూర్‌లో, ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి వర్ని మండలం మల్లారంలో, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మోపాల్ మండలం నర్సింగ్‌పల్లిలో, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు రుద్రూర్ మండలం బొప్పాపూర్‌లో, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ సిరికొండ మండలం చిన్నవాల్గోట్‌లో లబ్ధిదారులకు మంజూరుపత్రాలు అందజేశారు.



బోధన్ మండలం లంగ్డాపూర్‌లో ప్రొసీడింగ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

అర్ధరాత్రి నుంచే ఖాతాల్లోకి నిధులు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

మోర్తాడ్(బాల్కొండ): రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద నిధులు ఆదివారం అర్ధరాత్రి నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతాయని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని మోర్తాడ్ మండలంలోని దోన్‌పాల్‌లో నాలుగు సంక్షేమ పథకాలను జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మధ్యాహ్నం లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. జాబితాలో పేర్లు రాకపోతే ఆందోళన చెందొద్దని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని వెల్లడించారు. ఆర్మూర్ ఆర్డీవో రాజా గౌడ్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో తిరుమల, ఎంపీవో శ్రీధర్, ఏపీవో ప్రమీల, మాజీ సర్పంచ్ పర్స దేవన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముత్యాల రాములు తదితరులు పాల్గొన్నారు.



దోన్‌పాల్‌లో లబ్ధిదారులతో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

క్రైం కార్నర్

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఆర్మూర్ టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో గుర్తు తెలియని వ్యక్తి(45) మృతి చెందాడు. సదరు వ్యక్తి మామిడిపల్లిలో భిక్షాటన చేస్తూ జీవించేవాడు. మామిడిపల్లిలోని ఆర్మూర్ మోటార్స్ షాప్ వద్ద శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

బోధన్ రూరల్: బోధన్‌లోని రాకాసిపేట్ కాలనీకి చెందిన పంచల్ శివలింగ్ (31) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. శివలింగ్ కార్పెంటర్‌గా పని చేస్తుంటాడు. ఈ నెల 22న ఘన్‌పూర్‌కు వెళ్లి వస్తుండగా బైక్‌పై నుంచి పడి గాయపడ్డాడు. నిజామాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య సౌందర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గన్నారం గ్రామానికి చెందిన వివాహిత..

రుద్రూర్: కోటగిరి మండలం గన్నారం గ్రామానికి చెందిన గంగమణి (38) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు ఎస్సై సందీప్ తెలిపారు. అనారోగ్యం, ఇంట్లో గొడవలతో ఆమె మనస్తాపం చెంది మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయింది. మృతురాలి కుమారుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఖిల్లా స్కూల్‌లో అగ్ని ప్రమాదం



ఖలీల్‌వాడి: నగరంలోని ఖిల్లా ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పాఠశాల గదిలోని స్టోర్ రూంలో మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పి వేశారు.



ఎడపల్లి మండలం జానకంపేట గ్రామంలో 150 అడుగుల జెండాతో విద్యార్థుల ర్యాలీ

బ్రాహ్మణపల్లి వాసికి డాక్టరేట్



ఎడపల్లి: ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మండల చైర్మన్ మంగళంపాటి లింగం డాక్టరేట్ అందుకున్నారు. శనివారం తమిళనాడులోని హోసూర్‌లో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. 'సామాజిక సేవా కార్యక్రమాలు–విద్యా వ్యవస్థ నిర్వహణ' అనే అంశంపై ఆయన పరిశోధనలు చేశారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు



డీఆర్‌డీవో సాయాగౌడ్‌కు ప్రశంస పత్రం అందజేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

విధుల్లో ఉత్తమ సేవలందించిన అధికారులకు గుర్తింపు లభించింది. ఆదివారం నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన గణతంత్ర దినోత్సవాల్లో ఉత్తమ అధికారులకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి సునీత కుంచాల, అదనపు కలెక్టర్ అంకిత్ తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథచారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి | వాజీద్‌హుస్సేన్, జిల్లా వ్యవసాయ అధికారి | నాగశేషు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టీఎస్‌డబ్ల్యూఐడీసీ | రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్ | రాజశ్రీ, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి | రాజేంద్రకుమార్, బల్దియా డిప్యూటీ కమిషనర్, నిజామాబాద్ | గంగాధర్, కలెక్టర్ డ్రైవర్



కృష్ణసాగర్, కలెక్టర్ గన్‌మన్ | శ్రీధర్‌రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్మూర్ రూరల్ | సత్యనారాయణ, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్మూర్ టౌన్ | రఘుపతి, నిజామాబాద్ వన్ టౌన్ ఎస్సై | రతన్‌ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ డీఐజీ ఆఫీస్ | ప్రవీణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ డీఐజీ ఆఫీస్ | శ్రావణ్, ఆర్ఎస్సై, నిజామాబాద్



ఇంతియాజ్ అలీ, ఏఆర్ ఎస్సై, నిజామాబాద్ | నరేశ్, ఐసెల్, నిజామాబాద్ | అజీజ్‌ఖాన్, సబ్ ఇన్‌స్పెక్టర్, బోధన్ టౌన్ | సంతోష్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, నిజామాబాద్ | ఎండీ ఫయాజుద్దీన్, ట్రాఫిక్ కానిస్టేబుల్ | ప్రవీణ్‌కుమార్, కానిస్టేబుల్, సీటీసీ నిజామాబాద్ | ఎండీ షకీర్, హోంగార్డ్, ట్రాఫిక్ | బి గంగమోహన్, హోంగార్డు, ట్రాఫిక్ | సత్‌పాల్‌సింగ్, కానిస్టేబుల్, ట్రాఫిక్ | వెంకట్‌రామ్, సీసీఎస్, నిజామాబాద్ | రేఖారాణి, షీ టీమ్, నిజామాబాద్



పెద్దక్క, హోంగార్డ్ కళాబృందం | వెంకటనందన్‌రెడ్డి, ఎంవీఐ, నిజామాబాద్ | సి నారాయణ, అసిస్టెంట్ డిప్యూటీ జైలర్ | దేవిదాస్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కమ్మర్‌పల్లి | వేణు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎండోమెంట్ | స్రవంతి, డీఆర్‌డీఏ అకౌంట్ అసిస్టెంట్ | సాయిలు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ | మహేశ్, డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ | గురుదాస్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ మార్కెటింగ్ ఆఫీస్ టైపిస్ట్ | శివకృష్ణ, ఆర్మూర్ డీఎల్‌పీవో | భూమయ్య, డిస్ట్రిక్ట్ మార్కెటింగ్ ఆఫీస్ సూపర్‌వైజర్



శకటాల్లో మొదటి బహుమతి అందుకుంటున్న గృహనిర్మాణ శాఖ అధికారులు



రెండో బహుమతి అందుకుంటున్న ఆర్టీసీ అధికారులు



ఇందూరు జిల్లా మహిళా సమాఖ్యకు చెక్కు పంపిణీ చేస్తున్న కలెక్టర్



ప్రశంస పత్రం అందుకుంటున్న మున్సిపల్ కార్మికులు



సబ్‌జైలు వార్డెన్ సూర్యకాంత్‌కు ప్రశంస పత్రం అందిస్తున్న కలెక్టర్, జిల్లా జడ్జి సునీత కుంచాల



నిజామాబాద్ డివిజన్ రెవెన్యూ సిబ్బంది

బోధన్ పట్టణాభివృద్ధికి పాటుపడాలి

బోధన్: బోధన్ అంబేడ్కర్ చౌరస్తాలో ఏకచక్ర సేవా సమితి ఆధ్వర్యంలో 101 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఆదివారం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఐక్యతతో బోధన్ పట్టణ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. జాతీయ స్ఫూర్తి కలిగించేలా జెండాను ఏర్పాటు చేయడంపై అభినందించారు. సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మా శరత్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఏఎంసీ చైర్‌పర్సన్ అంకు సంధ్య దామోదర్, డీసీసీబీ మాజీ చైర్మన్ గంగాధర్‌రావు పట్వారీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్ రెడ్డి, ఏకచక్ర సేవా సమితి ప్రతినిధులు అంకు మహేష్, శ్రీనివాస్‌రావు, తలాండే ఈశ్వర్ పాల్గొన్నారు.



బోధన్‌లో జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, నాయకులు

శునకానికి పురుడు



లూసీకి పుట్టిన పిల్లలతో నర్సాగౌడ్ కుటుంబ సభ్యులు

ఓ దంపతులు పెంపుడు శునకానికి పురుడు పోసి తమకు జంతువుల పట్ల గల ప్రేమను చాటుకున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్ర శివారులోని మాణిక్ బండార్ గ్రామానికి చెందిన నర్సాగౌడ్, మంజుల దంపతులు లాబ్ బ్రీడ్‌కు చెందిన కుక్కను పెంచుకుంటున్నారు. దానికి లూసీ అని పేరు పెట్టారు. లూసీ ఇటీవల ఏడు పిల్లలకు జన్మనిచ్చింది. నర్సాగౌడ్ దంపతులు ఆదివారం బంధువులు, తెలిసిన వారిని పిలిచి లూసీకి పురుడు కార్యక్రమం నిర్వహించారు. లూసీకి, దాని పిల్లలకు పూలమాలలు వేసి అలంకరించారు. రుచికరమైన వంటలతో విందు భోజనం పెట్టారు.– మాక్లూర్/సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

కేంద్రమంత్రి బాధ్యతాయుతంగా మాట్లాడాలి

- ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రధాని మోదీ బొమ్మ పెట్టబోం
- నిధులు ఎలా ఇవ్వరో చూస్తాం
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్: కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ ఇందిరమ్మ ఇళ్ల పథకానికి మోదీ బొమ్మ పెట్టాలని, ఇందిరమ్మ పేరు మార్చాలని, లేకుంటే కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వదని వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రధాని మోదీ బొమ్మ పెట్టేది లేదని, నిధులు ఎలా ఇవ్వరో చూస్తామని ఆయన వ్యాఖ్యలు చేశారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ఆదివారం మోపాల్ మండలం నర్సింగ్‌పల్లి గ్రామంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. రాష్ట్రంలో అమల్జేస్తున్న సంక్షేమ పథకాలపై బీజేపీ నాయకులు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ దొందుదొందేనని ఎద్దేవాచేశారు. ఎమ్మెల్సీ కవిత అధికారం కోల్పోయిన తర్వాత బీసీ నినాదం ఎత్తుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ బీసీలకు 33శాతం రిజర్వేషన్లు అమల్జేస్తే బీఆర్ఎస్ 27శాతానికి తగ్గించిందన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం అమల్జేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టిందని గుర్తుచేశారు. నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

రిపబ్లిక్ డే రోజూ మద్యం అమ్మకాలు!

మోర్తాడ్: గణతంత్ర దినోత్సవం రోజున మద్యం అమ్మకాలపై నిషేధం ఉన్నా కొందరు తమ వ్యాపారాన్ని యథేచ్ఛగా సాగించారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం రావడంతో కొందరు ముందస్తుగా మద్యం కొని పెట్టుకోగా, మరికొందరు దళారుల నుంచి కొనుగోళ్లు జరిపారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, వేల్పూర్, మెండోరా, ముప్కాల్, భీమ్‌గల్, బాల్కొండ మండలాల్లోని వివిధ గ్రామాల్లో మద్యం అమ్మకాలకు అడ్డు అదుపులేకుండా పోయిందనే ఆరోపణలు ఉన్నాయి. బెల్టుషాపుల నిర్వాహకులు రెగ్యులర్‌గా మద్యం విక్రయించే చోట కాకుండా రహస్య ప్రాంతంలో మద్యం నిల్వ ఉంచి వ్యాపారం సాగించారు. అయితే మోర్తాడ్‌లో మద్యం అమ్మకాలపై పోలీసులకు సమాచారం అందించినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా అలాంటిది ఏమి లేదన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై రాజకీయాలు తగవు



మల్లారంలో మహిళకు ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి

- వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

వర్ని: పేదలకు మంజూరు చేసే ఇందిరమ్మ ఇళ్లపై రాజకీయాలు తగవని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పథకానికి ఇందిరమ్మ పేరు పెడితే నిధులు మంజూరు చేయమని కేంద్ర మంత్రి బండి సంజయ్ అనడం సమంజసం కాదన్నారు. మండలంలోని మల్లారం గ్రామంలో ఆదివారం లబ్ధిదారులకు నూతన పథకాల మంజూరు పత్రాలు ఆయన అందజేశారు. పక్కా గృహాలకు కేంద్ర ప్రభుత్వం రూ.1.25 లక్షలు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ.3.75 లక్షలు చెల్లిస్తోందని పేర్కొన్నారు. అధిక వాటా రాష్ట్ర ప్రభుత్వానిదే కాబట్టి ఏ పేరుతో అయినా పక్క గృహాలు మంజూరు ఇచ్చే హక్కు ఉందని పోచారం అన్నారు. కొత్తగా అమలు చేస్తున్న నాలుగు సంక్షేమ పథకాలను మార్చి నెలాఖరు వరకు రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు అందిస్తామని వివరించారు. బోధన్ ఆర్డీవో వికాస్ మహాతో, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, వర్ని తహసీల్దార్ సాయిలు, ఎంపీడీవో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం గణతంత్ర దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అలాగే ఆయా శాఖల ఆధ్వర్యంలో తయారు చేసిన శకటాలు ఆకట్టుకున్నాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్





కాకతీయ ఒలింపియాడ్ విద్యార్థుల నృత్య ప్రదర్శన



గణతంత్ర వేడుకల్లో ప్రదర్శించిన ఆర్టీసీ శకటం



నృత్యం చేస్తున్న విజయ్ హైస్కూల్ విద్యార్థులు



సైనిక దుస్తుల్లో నృత్యం చేస్తున్న విద్యార్థులు



ఆర్‌బీవీఆర్‌ఆర్ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన